# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విజయవాడ పర్యటనలో భాగంగా 'విజయవాడ ఉత్సవ్'లో పాల్గొంటారు.**
2. **మండలానికి ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసే నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ శాసన సభలో పేర్కొన్నారు.**
3. **తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.**
4. **రాజ్యాధికారంలోనూ, పాలనలోనూ బలహీన వర్గాలకు భాగస్వామ్యం కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

==========================

భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈరోజు విజయవాడలో పర్యటిస్తారు. ఈ మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడలోని దుర్గ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ సాయంత్రం పున్నమిఘాట్ వద్ద జరుగుతున్న 'విజయవాడ ఉత్సవ్'లో ఆయన పాల్గొంటారు. అనంతరం తిరుపతి వెళ్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు 5వ రోజు కొనసాగుతున్నాయి. ఈ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన ఉభయ సభలలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ...

వాయిస్..30 సెకన్లు

--------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈ సాయంత్రం స్వామివారి ఆలయంలో జరిగే ధ్వజారోహణ కార్యక్రమంతో లాంఛనంగా ప్రారంభమవుతాయి. మీన లగ్నంలో ధ్వజస్తంభంపై అర్చకులు ధ్వజపతాన్ని ఎగురవేస్తారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ రాత్రి స్వామివారికి జరిగే పెద్దశేష వాహన సేవలో ఆయన పాల్గొంటారు.

-----------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కొన్ని వస్తువలపై జీఎస్టీ ని సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన సిమెంట్ వ్యాపారి ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్.. 27 సెకన్లు

-----------------------------

రాజ్యాధికారంలోనూ, పాలనలోనూ బలహీన వర్గాలకు భాగస్వామ్యం కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో 'కుల గణన సామాజిక న్యాయం' పుస్తకాన్ని ఆమె నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలకు ఏవిధంగా న్యాయం జరగాలో 'కుల గణన సామాజిక న్యాయం' పుస్తకంలో విపులంగా వివరించినట్లు ఆమె పేర్కొన్నారు. కుల గణనతో బీసీలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

-----------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మిషన్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

..వాయిస్... 1. 35 సెకన్లు

-----------------------------

వ్యక్తిగత స్వచ్ఛాలయాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, అవసరం మేరకు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరంలో కలెక్టర్ నిన్న స్వచ్ఛ భారత్ మిషన్ పనులు, స్వచ్ఛతాహి సేవ –2025 కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2023 నుంచి ఇప్పటివరకు జిల్లాకు 15 వందల 50 వ్యక్తిగత స్వచ్ఛాలయాలు మంజూరు కాగా, అందులో 915 పూర్తి అయ్యాయని, 103 ఇంకా నిర్మాణంలో ఉన్నాయని వివరించారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

ఆసియా కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా సూపర్ ఫోర్‌లో భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈరోజు దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్ కు అర్హత సాధిస్తుంది. భారత్, బంగ్లాదేశ్ జట్లు ఆసియా కప్‌లో ఇప్పటి వరకు 17 సార్లు తలపడ్డాయి. అందులో భారత్ 16 మ్యాచ్‌లలో విజయం సాధించగా, బంగ్లాదేశ్ ఒక్కసారి గెలిచింది.

---------------------------

ఈరోజు జాతీయ సేవా పథకం-ఎన్ఎస్ఎస్ దినోత్సవం జరుపుకుంటున్నాం. సామాజిక సేవ పట్ల విద్యార్థులను చైతన్యవంతం చేసి... వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింపచేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 1969 సెప్టెంబర్ 24వ తేదీన జాతిపిత మహాత్మాగాంధీ శతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా దీనిని ప్రారంభించింది. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా... విద్యార్థులు సంఘ సేవ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఇందుకోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్న ఉద్దేశ్యంతో పోషకాహార మాసం నిర్వహిస్తున్నారు. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి తెలియజేశారు.

---------------------------

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించి, ఆరోగ్య అవగాహన కల్పించాలని జిల్లా రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారి టి. జగన్మోహనరావు సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన నిన్న సందర్శించారు.

=====================